వైఎస్సార్‌సీపీతోనే ముస్లింల అభ్యున్నతి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా ముస్లింల చేరిక
- అహమ్మద్ హుసేన్ ఆధ్వర్యంలో ఐదు మండలాల నుంచి వెల్లువలా చేరికలు


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి


పార్టీలో చేరిన ఐదు మండలాల ముస్లిం ప్రముఖులతో ఎమ్మెల్యే శిల్పా, చిత్రంలో అహమ్మద్ హుసేన్

ఆత్మకూరురూరల్: ముస్లింల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో ముస్లింలు టీడీపీ పట్ల చూపుతున్న వ్యతిరేక వైఖరికి అద్దం పట్టిన కార్యక్రమం శుక్రవారం రాత్రి ఆత్మకూరు పట్టణంలో జరిగింది. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ మోమిన్ ఆహమ్మద్ హుసేన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి సమక్షంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి తరలి వచ్చిన వందలాది మంది ముస్లిం మైనార్టీలు టీడీపీకి గుడ్ బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు. సుమారు 500 మంది ముస్లింలు పార్టీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డికి ఓటమి ఖాయమని తెలియడంతో విచక్షణ మరచి నోటికి వచ్చిన ఆరోపణలు, తిట్లతో తనను దూషిస్తున్నారన్నారు. తాను మేలు చేసి ఉంటే ఓట్లేయమని తానడుగుతుంటే, అతను ఏమి చేయనున్నాడో చెప్పకుండా తిట్లకు దిగుతుండడం అతని దౌర్భాగ్య స్థితిని తెలియజేస్తుందన్నారు. గురువారం నామినేషన్ల తరువాత జరిగిన సభలో బుడ్డా చేసిన ప్రసంగంలోని ప్రతి ఆరోపణను గుర్తు చేస్తూ శిల్పా సమాధానమివ్వడం గమనార్హం. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు హబీబుల్లా, ముస్లిం మైనారిటీ నాయకులు సయ్యద్ మీర్, అంజాద్ అలి, రషీద్, డిష్ జిలానీ, నూర్‌మహమ్మద్, మోమిన్ ముస్తఫా, ఇస్మాయిల్ జబివుల్లా, జక్కా మురళి, కౌన్సిలర్లు, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయం

వెలుగోడు: ముస్లి మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శుక్రవారం వెలుగోడు పట్టణంలో ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో మైనార్టీ సీనియర్ నాయకులు, రైతు సంఘం మాజీ ప్రెసిడెంట్ నస్రుల్లా ఖాన్‌తో పాటు మరో 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే శిల్పా సాదరంగా ఆహ్వానం పలికారు. నస్రుల్లా ఖాన్ మాట్లాడుతూ.. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, శ్రీశైలం నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా కులమతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని తెలిపారు. తెలుగు దేశం పార్టీ చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా సంక్షేమ పథకాలు పొందారని చెప్పారు. మతతత్వ బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు మాటల్నినమ్మవద్దని సూచించారు. శ్రీశైలం నియోజకవర్గ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని నస్రుల్లాఖాన్ కోరారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన నస్రుల్లాఖాన్, ముస్లిం మైనారిటీలు

క్లుప్తంగా

ఉపాధి పనుల్లో అక్రమాలకు తావివ్వొద్దు


ఉపాధికూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ

జూపాడుబంగ్లా: ఉపాధిపనుల్లో సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా విధులు నిర్వహించాలని ఏపీడీ అన్వరా బేగం సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. కూలీల మస్టర్లను పరిశీలించి హాజరైన కూలీల వివరాలు తెలుసుకున్నారు. పనులకు హాజరుకాకున్నా ఉపాధి కూలీలకు మస్టర్లు వేయవద్దని సిబ్బందికి సూచించారు. అలాగే నిర్ణీత కొలతల ప్రకారంగా పనులు చేయించి వారికి గరిష్టంగా రూ.250లు పైబడి కూలీ గిట్టుబాటు అయ్యేలా చేయాలన్నారు. ఈసీ నజీర్‌భాష, టీఏ లు చిన్న, ఇజ్రాయేల్, ఫీల్డ్ అసిస్టెంటు లింగన్న ఉన్నారు.

మతిస్థిమితం లేని యువతి ఐసీడీఎస్‌కు అప్పగింత


మతిస్థిమితం లేని యువతిని (ఎర్ర దుస్తులు) ఐసీడీఎస్‌కు అప్పగించిన కాంప్లెక్స్ మహిళలు

శ్రీశైలం : శ్రీశైల దేవస్థాన పరిధిలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ యువతిని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజలికి అప్పగించామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. సిద్ధరామప్ప కాంప్లెక్స్ వద్ద తిరుగుతున్న సదరు మహిళను విచారించగా ఊరు, పేరు, పూర్తి వివరాలు చెప్పలేకపోతోందన్నారు. పరిరక్షణ నిమిత్తం ఆ మహిళను ఐసీడీఎస్‌కు అప్పగించడం జరిగిందన్నారు.

ఘనంగా పారువేట మహోత్సవం


పల్లకీలో ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న దృశ్యం

పగిద్యాల: శ్రీ రామనవమి తిరునాలను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి పారువేట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న పారువేట మండపం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ బద్ధంగా పారువేట మహోత్సవం చేపట్టారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

శ్రీశైలం నియోజకవర్గానికి రెండు నామినేషన్లు


శిల్పా చక్రపాణిరెడ్డి తరఫున రెండో నామినేషన్ దాఖలు చేస్తున్న సయ్యద్‌మీర్

ఆత్మకూరు: శ్రీశైలం నియోజవర్గానికి రెండోరోజు శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో సుధారాణి తెలిపారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా సయ్యద్‌మహ్మద్ సికిందర్‌బాషా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సింగారెడ్డి శిల్పా చక్రపాణిరెడ్డి తరపున రెండో నామినేషన్‌ను సయ్యద్‌మీర్ దాఖలు చేశారు. రెండు రోజుల్లో మొత్తం ఆరు నామినేషన్లు వచ్చినట్లు ఆర్వో చెప్పారు.

నందికొట్కూరులో మూడు నామినేషన్లు

నందికొట్కూరు: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండోరోజు ముగ్గురు నామినేషన్లు వేసినట్లు ఆర్వో దాసు తెలిపారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో బీఎస్పీ తరుపున గద్దల లాజరేసు, స్వతంత్ర అభ్యర్థులుగా కుందా వెంకటేశ్వర్లు, పల్లె నాగరాజు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో నందికొట్కూరు నియోజకవర్గం నుంచి రెండోరోజు ముగ్గురు నామినేషన్లు దాఖలయ్యాయి.

సౌందర్యలహరి పారాయణం



సౌందర్యలహరి పారాయణం చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళారాధన వేదికపై హైదరాబాద్‌కు చెందిన ఆర్. ఝాన్సీలక్ష్మీ, బృందం వారిచే సౌందర్యలహరి పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని, తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వధూవరులకు ఎమ్మెల్యే శిల్పా ఆశీర్వాదం

ఆత్మకూరు: పట్టణంలోని ఎండబ్ల్యూ ఫంక్షన్‌హాల్‌లో మిలిటరీకి చెందిన శివపురం రఫిక్ చెల్లి వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మండలంలోని క్రిష్టాపురం గ్రామంలో రహిమాన్ కుమారుడు రఫిక్ నిఖా మహోత్సవానికి ముఖ్య అతిథిగా శిల్పా కార్తీక్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా


రాజీనామా చేసిన పారుమంచాల వలంటీర్లు


రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామికి అందిస్తున్న కొత్తపల్లి వలంటీర్లు


రాజీనామా చేస్తున్న నెహ్రూనగర్ వలంటీర్లు

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానంతో పారుమంచాల గ్రామానికి చెందిన 13మంది వలంటీర్లు శుక్రవారం వారి విధులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్‌కి అందజేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వలంటీర్లకు ఎంతో ప్రాధాన్యతనిచ్చి దళారీ వ్యవస్థ లేకుండా, అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయటం ప్రశంసనీయమన్నారు. ఆయనపై ఉన్న అభిమానంతో తాము వలంటీరు విధులకు రాజీనామా చేసి, స్వచ్ఛందంగా జగనన్న గెలుపు కోసం పాటుపడనున్నట్లు తెలిపారు.

11 మంది వలంటీర్లు రాజీనామా

కొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన 11 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. గ్రామంలో మొత్తం 18 ఉండగా ఇందులో 10 మంది గ్రామ వలంటీర్లు ఎస్.హసన్, ఎం.నాగరాజు, ఎం. సురేష్, జీ.సురేష్‌బాబు, జి.కిరణ్ కుమార్, యు రామక్రిష్ణ, యస్వంతి, భవాని, విజయభారతి, సుబ్బలక్ష్మీ స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామికి వారి రాజీనామా పత్రాలను అందజేశారు. అదేవిధంగా కొత్తపల్లి భ్రమరాంబాగూడెంకు చెందిన వలంటీర్ మధునాయక్ తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ జవహర్‌బాబు అందించారు.

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్ సచివాలయం -1 పరిధిలో విధులు నిర్వహించే 10 మంది గ్రామ వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛందంగా తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్‌కు సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి రాజీనామ చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి


శివపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్


జలకనూరులో ఓటు అభ్యర్థిస్తున్న దారా సుధీర్

కొత్తపల్లి: ప్రజా సమస్యలు తీరాలన్నా, సంక్షేమం కొనసాగాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని, అందుకు ప్రజలు ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని శివపురం, శివపురం గూడెంలో కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ గౌస్, ఎంపీటీసీ శివన్నల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలు వింటూ, ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నంద్యాల ఎంపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డిని, నందికొట్కూరు ఎమ్మెల్యేగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలు లేకుండా సుఖసంతోషాలతో ఉండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, వలంటీర్లు ప్రజలకు సేవ చేయాలన్నా జగనన్న మరలా సీఎం కావాలన్నారు. లేకపోతే రాష్ట్రం దొంగల చేతుల్లోకి వెళ్తుందన్నారు. వారు రాష్ట్రాన్ని మూడుముక్కలు చేసి మూడుపార్టీలు తలోవైపు పంచుకొని దోచుకుంటారన్నారు. ప్రజా పాలన కావాలో దొంగల పాలన కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ప్రచారంలో భాగంగా గిరిజన పిల్లలతో, శివపురం గ్రామ యువకులతో దారా సుధీర్ క్రికెట్ ఆడారు. జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, సర్పంచులు బాల ఎల్లయ్య, కలబండి మారేన్న,విజయ్ కుమార్, ఎంపీటీసీలు శివన్న, బాలరాజు, సచివాలయాల మండల కన్వీనర్ నాగలక్ష్మి రెడ్డి, కొలనుభారతి ఆలయ చైర్మన్ వెంకటనాయుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నందికొట్కూరు రూరల్ : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కోనేటమ్మపల్లి గ్రామంలో బోరెల్లి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మృతికి సంతాపం..

మండల పరిధిలోని వడ్డెమాను గ్రామానికి చెందిన రాఘవరెడ్డి(74) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ గ్రామానికి వెళ్లి పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

మిడుతూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని జలకనూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దారా సుధీర్ మాట్లాడుతూ ప్రజల నాడి తెలిసిన నాయకుడిగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారన్నారు. పేదల పక్షపాతిగా సంక్షేమ పాలన అందించిన ఆయనకు ప్రజాక్షేత్రంలో ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండం హరిసర్వోత్తమరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వర రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ రవికుమార్, నాయకులు మల్లు రామలింగారెడ్డి, రాంపుల్లారెడ్డి, తిరుపాలు రెడ్డి, పుల్లయ్య, నజీర్, అబ్దుల్ గని, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

మిడుతూరు: మండలపరిధిలోని తలముడిపి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనం నుంచి పడి తీవ్రగాయాలై చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు తలముడిపి గ్రామానికి చెందిన పుల్లయ్య (30) తండ్రి సువార్తయ్యతో కలసి బుధవారం రాత్రి గడివేముల నుంచి తలముడిపి వస్తూ ప్రమాదవశాత్తు ద్వి చక్ర వాహనం నుంచి కిందపడ్డాడు. గాయాలైన పుల్లయ్యను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్సపొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని తండ్రి సువార్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండలపరిధిలోని కడుమూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. కడుమూరు గ్రామానికి చెందిన సంపత్ కుమార్ 20 మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. అతని నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన


సచివాలయంలో ఆరు నెలల చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ షహనాజ్

శ్రీశైలం : సచివాలయంలో పీహెచ్‌సీ డాక్టర్ షహనాజ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్య బృందం స్థానిక సచివాలయంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపునకు అపూర్వ స్పందన లభించింది. సుమారు వంద మందికి పైగా కంటి పరీక్షలు, గైనకాలజీకి సంబంధించిన పరీక్షలను నిర్వహించుకున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ షహనాజ్ తెలిపారు. వలంటీర్లు లేకపోయినప్పటికీ వైద్యపరీక్షల నిమిత్తం అనేకమంది బాలింతలు, పిల్లలు గలవారు, కంటి చూపు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన రోగులు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో పారా మెడికల్ సిబ్బందితో పాటు అసిస్టెంట్ ఆప్తమాలజిస్ట్ ఎస్‌కే షేక్‌షావలి, పీహెచ్ఎన్ రేణుకాదేవి, సూపర్‌వైజర్ సుభాషిని, ఎంపీహెచ్ఈఓ నజీర్, మలేరియా అధికారి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ


మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల దంపతులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది.

మహానందీశ్వరుడి సన్నిధిలో జేసీ

మహానందీశ్వరుడి సన్నిధిలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం ఈఓ స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

మహానందిలో చిరుజల్లులు

మహానంది పుణ్యక్షేత్రంతో పరిసరాల్లో శుక్రవారం సాయంత్రం చల్లటి గాలులతో పాటు తేలికపాటి జల్లులు కురిశాయి. ఉక్కపోతకు గురైన ప్రజలు చల్లటి గాలులతో ఉపశమనం పొందారు. ఇదిలా ఉండగా భారీ వర్షం ఉందంటూ వాతావరణశాఖ హెచ్చరికలతో వివిధ పంటలను సాగు చేస్తున్న రైతులు ఆందోళనకు గురయ్యారు.

ఓంకారంలో ఏకాదశి పూజలు

బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రంలో చైత్రమాసం, శుక్ల ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీ గంగ, ఉమా సమేత శ్రీ ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లకు మహా రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపించారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

నవగ్రహ ఆలయాల్లో ఏకాదశి వేడుకలు


మరకతలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

గాజులపల్లె ఆర్ ఎస్ గ్రామంలోని శ్రీ గంగ, గౌరీసమేత మరకతలింగేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. నవగ్రహాల ఆలయాల్లోని శుక్రుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

అన్ని వార్డుల్లో అభివృద్ధి

- 29 వార్డుల్లో 64 డ్రైనేజీల నిర్మాణం
- రూ.5.95 కోట్లతో పనులు
- 90 శాతం నిర్మాణాలు పూర్తి


17వ వార్డులో పూర్తయిన డ్రైనేజీ నిర్మాణం


10వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ పనులు

నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం 58 మాసాల పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తూ నందికొట్కూరు పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. పట్టణంలో ఈ ఐదేళ్ల జరిగిన అభివృద్ధి ఎన్నడూ జరగలేదని పట్టణ ప్రజలు చెబుతున్నారు.

అన్ని వార్డుల్లో డ్రైనేజీల నిర్మాణం

పట్టణంలోని 29 వార్డుల్లో రూ.5.95 కోట్లతో 64 డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టారు. శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణంలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.10 కోట్లతో 16 డ్రైనేజీలు, ఎస్సీ ఎస్పీ నిధులు రూ.1.18 కోట్లతో ఏడు డ్రైనేజీలు, 15వ ఆర్థిక నిధులు రూ. 86.27 లక్షలతో ఎనిమిది డ్రైనేజీలు, జనరల్ ఫండ్ కింద రూ. 1.45 కోట్లతో 26 డ్రైనేజీలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.35 లక్షలతో ఏడు డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టారు.

మా వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేశారు



మా వార్డులో ఎప్పుడూ లేని విధంగా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేశారు. గత టీడీపీ పాలనలో రోడ్లు, డ్రైనేజీలు లేక వర్షం కాలంలో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేయించడంతో ఇక ఇబ్బందులు తప్పినట్లే.
– మన్సూర్

ప్రత్యేక నిధులతో డ్రైనేజీల నిర్మాణం



ప్రభుత్వం నుంచి నిధులు రూ.15.34 కోట్లు మంజూరు చేయించి పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు 90 శాతం పూర్తి చేయడం జరిగింది. మిగతా10 శాతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ నిధులు మొత్తం కలిపి రూ. 50.68 కోట్ల నిధులతో అభివృద్ధి చేశాం. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలో అభివృద్ధి చేసి చూపించాం.
– బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, శాప్ రాష్ట్ర చైర్మన్

నిద్రమాత్రలు మింగిన వ్యక్తి మృతి

పగిద్యాల: జీవితంపై విరక్తి చెంది ఈనెల 15న నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. పగిద్యాలకు చెందిన మంగళి పెద్ద నాగరాజు (37) కొంత కాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. ఎంతో మంది వైద్యులను సంప్రదించినా ఫలితంలేక పోయింది. నొప్పి తాళలేక నాలుగు రో జుల క్రితం నిద్రమాత్రలు మింగాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని మెరుగైన వైద్యంకోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ముచ్చుమర్రి పోలీసులు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఫైర్ సిబ్బంది

ఆత్మకూరు: పట్టణంలోని రఘునాథ్ సెంటర్, గౌడ్ సెంటర్, రాయుడు వైద్యశాలలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అగ్నిమాపక అధికారి భీముడునాయక్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.